

బస్టాండ్‌లోకి వెళ్ళేదెలా...

బైక్‌లతో నిండిపోతున్న దారి



బస్టాండ్ ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనాలు

కళ్యాణ్‌నగర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది మంది ప్రయాణికులు ప్రయాణించే గోదావరిఖని బస్టాండ్ రహదారికి అడ్డంగా ఇష్టానుసారంగా మోటార్ సైకిళ్లను నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులు వెళ్లడానికి దారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రయాణికులు రోడ్డుపైనే వాహనాలను నిలిపి దూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుండడం, ఆటోలు కూడా ప్రయాణికులకు అడ్డంగా నిలుపుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ పక్కనే పార్కింగ్ ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ పార్కింగ్ చేయకుండా బస్టాండ్ రోడ్డుపైనే వాహనాలను నిలుపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలుపుకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'కస్తూర్బా'లకు మహర్దశ

- భవనాల మరమ్మతులు, ఇతర పనులకు నిధులు మంజూరు
- కొనసాగుతున్న పనులు
- మెరుగు పడుతున్న వసతులు



ముత్తారం కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గల కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాలకు మహర్దశ పట్టనున్నది. కొంత కాలంగా రంగులు వేయక వెలవెలబోతున్న భవనా లకు రంగులు వేయడంతోపాటు మరమ్మతులకు సమగ్ర శిక్ష ద్వారా నిధులు మంజూరు చేశారు. ఆ పనులను ఈ నెలా ఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. ధర్మారం, ముత్తారం, తదితర గురుకుల విద్యాలయాల భవనాల పేయింటింగ్ పనులు పూర్తయ్యాయి.

దేశ వ్యాప్తంగా బాలికల అక్షరాస్యతను పెంచేందుకు 2010లో కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాల యాలను తీసుక వచ్చింది. ఈ విద్యాలయాలకు సమగ్ర శిక్ష ద్వారా నిధులను కేటాయిస్తుండగా, రాష్ట్ర విద్యా శాఖ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నారు. ఆ సమయంలో ఉమ్మడి కరీంనగర్ పరిధిలో ఉన్న జిల్లాలోని ధర్మారం, జూలపల్లి, రామగుండం, ముత్తారం, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల్లో కస్తూర్బా విద్యాలయాలను మంజూరు చేశారు. 2016 అక్టోబర్‌లో పెద్దపల్లి జిల్లాగా ఏర్పాటు కాగా, అంతర్గాం, పాలకుర్తి, రామగిరి కొత్త మండలాలు ఏర్పాటయ్యాయి. ఆ మండలాలకు కూడా కేంద్ర ప్రభుత్వం కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయాలను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో జిల్లాలో 10 విద్యాలయాలు కొనసాగు తున్నాయి.

ఈ విద్యాలయాల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ మీడియెట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన చేస్తున్నారు. వీటికి మంచి డిమాండ్ ఏర్పడింది. 6 నుంచి 10వ తరగతి వరకు 2 వేల సీట్లు, ఇంటర్‌లో 1280 సీట్లు ఉన్నాయి. యేటా అన్ని సీట్లు భర్తీ అవుతున్నాయి. కొత్త మండలాల్లో భవనాలు గతేడాది పూర్తి కాగా, ప్రస్తుతం వాటిలోనే తరగతులు కొనసాగు తున్నాయి. పాత మండలాల భవనాలు 2012లో పూర్త య్యాయి. ఆ భవనాలకు మొదట వేసిన రంగులు వెలసిపోయాయి. ఐదేళ్ల క్రితమే రంగులు వేయాల్సి ఉండగా వేయలేదు. ఎట్టకేలకూ ఆ భవనాలకు రం గులు వేసేందుకు ప్రభుత్వం 91 లక్షల 84 వేల రూపాయల నిధులు మంజూరు చేసింది.

(మిగతా 8వ పేజీలో)

కస్తూర్బా విద్యాలయాలకు ప్రతిపాదించిన, మంజూరైన నిధులు (లక్షలలో)

క్రసం.	మండలం	ప్రతిపాదించినవి	మంజూరైనవి
1.	ధర్మారం	56.000	26.992
2.	జూలపల్లి	5.000	2.410
3.	ముత్తారం	13.000	6.266
4.	ఓదెల	56.000	26.992
5.	పాలకుర్తి	5.000	2.410
6.	రామగిరి	8.000	3.856
7.	రామగుండం	8.000	3.856
8.	కాల్వశ్రీరాంపూర్	8.000	3.856
9.	సుల్తానాబాద్	5.000	2.410
10.	అంతర్గాం	5.000	2.410
	మొత్తం	169.000	81.458

కుల సంఘాలకు అండగా ఉంటా

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



గొర్రెల కాపరులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కుల సంఘాలకు అండగా ఉంటానని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీతో పాటు మేడారంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ నెల రోజుల వ్యవధిలో బొమ్మరెడ్డిపల్లి, చామనపల్లిలో 150కి పైగా గొర్రెలు ప్రమాదంలో చనిపోవడం బాధాకరమని మంత్రి అన్నారు. యాదవ కుటుంబాలకు 8 లక్షల 70 వేల ఆర్థిక సహాయం త్వరగా అందించామని తెలిపారు. యాదవ, కుర్మ, గౌడ, మున్నూరు కాపులకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తానని, వీలైనంత త్వరగా స్థల పరిశీలన చేసుకోవాలని సూచించారు. ఎర్రగుంటపల్లిలో ఐటీఐ కళాశాల నిర్మిస్తామని తెలిపారు. కలెక్టర్ మట్లాడుతూ 15 రోజుల క్రితం గొర్రెలు చనిపోగా మంత్రితో కలిసి నష్టపరిహారం విషయంలో యాదవ కుటుంబాలకు ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని హామీ ఇచ్చామని తెలిపారు. బొమ్మరెడ్డిపల్లిలో 5గురు లబ్ధిదారులకు 5లక్షల10 వేలు, చామనపల్లిలో 9 మందికి 3 లక్షల 64 వేల చెక్కులు పంపిణీ చేస్తున్నామన్నారు. చామనపల్లిలో ఓ పేద కుటుంబం ఇల్లు కాలిపోయిన ఘటన మంత్రి దృషికి రాగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని, మండల వ్యాప్తంగా 6 వందల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.

బీఆర్ఎస్ అవినీతిపై కేంద్రం ఎందుకు జోక్యం చేసుకోలేదు

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పదేళ్ళ అవినీతి పాలన చేసిన బీఆర్ఎస్ పార్టీపై ఎందుకు విచారణ జరిపించలేదని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ వేల కోట్ల అవినీతికి పాల్పడినా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారినా కేంద్ర మంత్రి అమిత్‌షా ఎందుకు విచారణకు ఆదేశించలేదో సమాధానం చెప్పాలన్నారు. ఈడీలు, సీబీఐలు మీ చేతుల్లో ఉన్నా బీఆర్ఎస్ పార్టీ అవినీతిపై ఎప్పుడు బీజేపీ ప్రశ్నించలేదన్నారు. చట్టసభల్లో బీజేపీకి బీఆర్ఎస్ పార్టీ మద్దతు చెబుతుందని, బీఆర్ఎస్ బీజేపీకి బీ-టీమ్ పార్టీ అయినందునే పదేండ్లు అవినీతికి పాల్పడిన బీజేపీ పెద్దలు చూసీచూడనట్లు వ్యవహరించారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ నేతృతంలో పేదల కోసం ముఖ్యమంత్రి చేస్తున్న సంక్షేమ పథకాలు బీజేపీ పెద్దలకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లాలని మాట్లాడిన మాటలే తప్ప ఆయన మాటల్లో చిత్తశుద్ధి

(మిగతా 8వ పేజీలో)

ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం

- వైద్య కళాశాల, ఆసుపత్రి తనిఖీ చేసిన డీఎంఈ



ఆసుపత్రి పరిశీలిస్తున్న డీఎంఈ శివరాంప్రసాద్

కళ్యాణ్‌నగర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని వైద్య విద్య సం చాలకులు(అకాడమిక్) శివరాంప్రసాద్ అన్నారు. మౌలిక వసతులు, కావాల్సిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పరిశీలించడానికి సోమవారం వైద్య కళాశాల, జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ కోయ శ్రీహర్ష, టీఎస్ఎంఐడీసీ ఈఈ విశ్వప్రసాద్ తనిఖీలు నిర్వహించారు. మెడికల్ కళాశాలకు కావాల్సిన వసతులపై ప్రిన్సిపాల్ హిమబిందును, విద్యార్థులను తెలుసుకున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఐసీయూ కేంద్రాన్ని, జనరల్ వార్డులను పరిశీలించారు. రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కావాల్సిన సౌకర్యాలు, వసతులను వివరించారు. ఇక్కడి పరిస్థితులపై సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు నివేదిక సమర్పించనున్నట్టు డీఎంఈ తెలిపారు. కాగా మంగళవారం డాక్టర్స్ డే సందర్భంగా ఆసుపత్రి వైద్యులకు డీఎంఈ, కలెక్టర్ వైద్యుల సమక్షంలో కేక్‌కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, ఆర్ఎంఓ రాజు, ప్రొఫెసర్లు అనూష, శ్రీనివాస్, అశోక్, హర్షిణి, ఓబులేష్, రవి వర్మ, అమల ఉన్నారు.

ఆడిటోరియం, ఎగ్జామ్ హాల్స్‌ను ఏర్పాటు చేయండి

సిమ్స్ మెడికల్ కళాశాలలో విద్యార్థులకు ఎగ్జామ్ హాల్, ఆడిటోరియం ఏర్పాటు చేయాలని డీఎంఈ శివరాంప్రసాద్‌ను కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు కోరారు. ఫర్నీచర్, డైనింగ్ హాల్, మైక్రోస్కోప్‌లు, పుస్తకాలు, వీడియో కాన్ఫరెన్స్ రూమ్‌లు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మార్చురీ, కిచెన్, సీఎస్‌బీ, ఫార్మాసిస్టు భవనంతోపాటు బెడ్ల సంఖ్యను పెంచాలన్నారు.

వైద్య కళాశాలలో మౌలిక వసతులపై నివేదిక

సింగరేణి వైద్య కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనపై వైద్య సంచాలకులు శివరాం ప్రసాద్‌కు నివేదిక సమర్పించినట్టు కలెక్టర్ కోయ శ్రీహర్ష చెప్పారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాల, టీచింగ్ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, ఫ్యాకల్టీ వ్యవహారాలపై ప్రత్యేక కమిటీ రూపొందించిందని, జాతీయ వైద్య విద్య కౌన్సిల్ నియమించిన రాష్ట్ర వైద్య బృందానికి నివేదికను అందజేసినట్టు తెలిపారు. ప్రభుత్వ కళాశాలతోపాటు జిరాక్స్ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలని కోరినట్టు తెలిపారు. టీఎస్ఎంఐడీసీ ఈఈ విశ్వ ప్రసాద్, కమిటీ సభ్యులు హిమబిందు, ఆర్ఎంఓ రాజు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

పెద్దపల్లిటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు తెలుపుతూ ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పెద్దపల్లి మండలం పెద్ద బొంకూరు గ్రామానికి చెందిన రమేష్ తనకు గ్రామ శివారు లో మొత్తం 2 ఎకరాల వ్యవసాయ భూమికి ఉందని, రైతుభరోసా అమలు కావడం లేదని దరఖాస్తు చేసుకోగా జిల్లా వ్యవసాయ అధికారికి రాశారు. రామగుండం మండలం కుందనపల్లి గ్రామానికి చెందిన వేల్పుల అనూష అర్హతలు ఉన్నప్పటికీ గృహ జ్యోతి పథకం అమలు కావడంలేదని, అమలు చేయాలని దరఖాస్తు చేసుకోగా విద్యుత్ శాఖ ఎస్ఈకి పరిశీలించాలని రాశారు. పెద్దపెల్లి పట్టణంలోని తాజ్ కాలనీ రోడ్డు కు చెందిన అస్మిత్ జహన్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్ నడిపిన యజమానికి జరిమానా

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



కాసులపల్లిలో ట్రాక్టర్ యజమానికి రశీదును అందిస్తున్న సిబ్బంది

పెద్దపల్లి రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్ నడుపుతున్నారని సోమవారం 'యథేచ్ఛగా రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు' అనే కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. కాసులపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ పాష సంబంధిత ట్రాక్టర్ యజమానికి రూ.5 వేలు జరిమానా విధించి రశీదును గ్రామ పంచాయతీ సిబ్బందితో అందించారు. రోడ్డుపై కేజ్ వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను రోడ్డుపై నడిపితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పంచాయతీ అధికారులు కేజ్ వీల్స్‌తో వాహనాలు నడపవద్దని గ్రామాల్లో డప్పు చాటింపులు చేయించారు. ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో కేజ్ వీల్స్‌తో రోడ్ల పైకి వస్తే మొదటిసారి రూ.5 వేలు, రెండోసారి రూ.10 వేలు, మూడోసారి పట్టుబడితే ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని పేర్కొన్నారు. కేజ్‌వీల్స్‌తో రహదారులు దెబ్బతింటాయని పేర్కొన్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సునకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు కోసం ఈనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవా లని జిల్లా సంక్షేమ అధికారి వేణుగో పాల్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఆపై చదువు మానేసిన నిరుద్యోగ యువతుల కోసం ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు నిర్వహిస్తు న్నామని, ఎన్టీపీసీ జ్యోతినగర్‌లోని విక్టరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్‌లో ఆరు నెలల పాటు కోర్సు ఉంటుందని, దీనికి శిక్షణ ఫీజు ప్రభుత్వం చెల్లిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్ పొందాలని, అడ్మిషన్ పరీక్ష ఫీజు అభ్యర్థులు చెల్లించాలని, ఆసక్తిగల అభ్యర్థులు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని, జిల్లా వెబ్‌సైట్ peddapalli.telangana.gov.inలో దరఖాస్తు ఫారం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి



సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్, దాసరి మనోహర్‌రెడ్డి, గుజ్జుల రామకృష్ణారెడ్డి

పెద్దపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారులు చేపట్టిన శాంతియుత దీక్షకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, గుజ్జుల రామకృష్ణారెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్‌లు సంఘీభావం ప్రకటించారు. సోమవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద ఉద్యమకారులు శాంతి యుత దీక్ష చేపట్టారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అనేక హామీలను ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత ఒక్క హామీ నెరవేర్చడం లేదని విమర్శిం చారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజా ల ప్రభుత్వ స్థలంతోపాటు ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటి వరకు ఉద్యమకారుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఇప్ప టికైనా ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని, లేదంటే ఉద్యమకారుల ఆగ్రహానికి గురి కాక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గురుకులాల్లో ఫోన్‌మిత్ర

- ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థుల హోంసిక్‌కు చెక్
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



ఫోన్‌లో కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న విద్యార్థులు

ధర్మారం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో చదివే విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడేందుకు వీలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. నిత్యం తల్లిదండ్రులపై బెంగతో చదువుల్లో వెనకబడేవారు. నెలలో ఒకసారి వచ్చే తోటి విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ తీసుకొని తల్లిదండ్రులతో మాట్లాడేవారు. లేదంటే ప్రతీ నెల రెండో శనివారం వచ్చే వారి తల్లిదండ్రుల రాకకోసం ఎదురు చూడక తప్పని పరిస్థితి. నిత్యం విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇలాంటి మానసిక ఇబ్బందులకు ఫోన్ మిత్ర కార్యక్రమంతో రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెట్టింది.

మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకే...

గురుకులం చదివే విద్యార్థులు తల్లిదండ్రులకు దూరంగా ఉండడంతో వారు మానసిక ఒత్తికి గురికాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఫోన్‌మిత్ర కార్యక్రమం తీసుకువచ్చింది. దీని ద్వారా గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను అనుసరించి స్మార్ట్ ఫోన్స్ ఏర్పాటు చేశారు. నంది మేడారం గురుకుల బాలికల పాఠశాలలో 640 మంది విద్యార్థుల చదువుతుండగా 7 స్మార్ట్ ఫోన్లను, మల్లాపూర్‌లో 665 మంది విద్యార్థులకు 7 స్మార్ట్ ఫోన్లను బిగించారు. ఫోన్ మాట్లాడుకునేందుకు వీలుగా నలుగురు విద్యార్థులకు కలిపి ఒక స్మార్ట్ కార్డ్ ఇచ్చారు. ఒక్కో స్మార్ట్ కార్డులో విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లను సేవ్ చేశారు. విద్యార్థులంద రికి కలిపి 160 స్మార్ట్ కార్డ్‌ను అందించారు. రోజు ఒక్క స్మార్ట్ కార్డు నుంచి 25 నిమిషాల పాటు విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుకోవచ్చు.

స్మార్ట్ కార్డ్స్ వాడడం ఎలా...?



ప్రతి స్మార్ట్ కార్డులో నలుగురు విద్యార్థులకు 1 నుంచి 4 నంబర్లు కేటాయిస్తారు. ఫోన్లో స్మార్ట్ కార్డు ఇన్‌సర్ట్ చేసి 8 నొక్కగానే 1 నంబర్‌పై సేవ్ అయిన నంబర్ డిస్‌ప్లే అవుతుంది. అలా 8వ సంఖ్య నొక్కితూ 2,3,4 నంబర్ విద్యార్థులు కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లు డిస్‌ప్లే అవుతాయి. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో మాట్లాడుకోవచ్చు. గురుకులం నుంచి విద్యార్థి వెళ్ళిపోయినా, వారి స్థానంలో కొత్తగా చేరినా నూతనంగా నంబర్లు కేటాయించవచ్చు. ఇందుకోసం ప్రత్యేకంగా పాస్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ మిషన్ గురుకులం ప్రిన్సిపాల్ ఆధీనంలో ఉంటుంది.

విద్యార్థుల్లో వెల్లివిరుస్తున్న సంతోషం

ఇన్ని సంవత్సరాలు తల్లిదండ్రులతో మాట్లాడేందుకు నానా తంటాలు పడ్డ విద్యార్థులు ఫోన్ మిత్రతో వారిలో సంతోషం వెల్లివిరుస్తుంది. తరగతులు జరుగుతున్న సమయం మినహాయించి విద్యార్థులు ఎప్పుడైనా ఫోన్ మాట్లాడు కోవడానికి వీలు కల్పించారు. విద్యార్థులకు కేటాయించిన స్మార్ట్ కార్డ్ వారి వద్దనే ఉంచుకునే సౌకర్యం కల్పించారు. ఇన్ని రోజులు కుటుంబ సభ్యులతో ఫోన్ మాట్లాడాలంటే టీచర్ల ఫోన్ల ద్వారా మాట్లాడే వారమని, లేదంటే గురుకులంకు వచ్చే ఇతర విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్లను అడిగి మాట్లాడేందుకు ఇబ్బందులు ఎదుర్కొనే వారమని, ఇప్పుడు మా గురుకులంలోనే ఫోన్లు పెట్టడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థులు తెలిపారు.

ఫోన్ మాట్లాడేందుకు ఇబ్బందులు ఉండేవి

- తీట్ల అక్షయ, పదో తరగతి కాసులపల్లి



ఇంతకు ముందు ఇంటికి ఫోన్ చేయడానికి ఇబ్బందులు పడేవాళ్లం. టీచర్ల, తోటి విద్యార్థుల పేరెంట్స్ ఫోన్స్ తీసుకొని చేసే వాళ్ళం. ఇప్పుడు తల్లిదండ్రులతో ఫోన్ మాట్లాడానికి ఎలాంటి ఇబ్బంది లేదు.

తల్లిదండ్రుల కోస ఎదురుచూపులు

బానోతు అభినయ పదో, తరగతి



ఫోన్ మాట్లాడే వీలులేక పేరెంట్స్ వచ్చే రెండో శనివారం కోసం ఎదిరి చూసే దాన్ని. తల్లిదండ్రులతో ఫోన్ మాట్లాడకుండే ఏదో లోటుగా అనిపించేది. మా స్కూల్‌లో ఇప్పుడు ఫోన్ పెట్టడంతో రోజు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నాను.

మంచి చెడు రెండూ ఉంటాయి.

సముద్రాల యుగంధర లక్ష్మీ ప్రిన్సిపాల్, నంది మేడారం



ఫోన్ల ఏర్పాటుతో మంచి చెడు రెండూ ఉంటాయి. కుటుంబ సభ్యులతో మాట్లాడిన తరువాత పిల్లలు ఆనందంతో వారి చదువు వారు చదువుకుంటారు. అయితే కుటుంబ సభ్యులు విద్యార్థుల బాగోగులు మాట్లాడాలే తప్ప, వారి కుటుంబ సమస్యలు విద్యార్థులకు చెప్పకూడదు. అలా చెప్పడం వల్ల ఇంటి మీద బెంగతో విద్యార్థులు మానసిక ఒత్తికి లోనవుతారు. దీని ద్వారా వారు చదువుల్లో వెనుకబడే అవకాశం ఉంది.

బొక్కలవాగు పై బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన

మంథని, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గంగాపురి-బోయినిపేటల మధ్య బొక్కల వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు అధికారులు, కాంగ్రెస్ పార్టీ నేతలు సోమవారం స్థలాన్ని పరిశీలించారు. గతంలో ఈ బ్రిడ్జిని కూచిరాజ్‌పల్లి వద్ద ప్రతిపాదించగా ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో రూ.162 కోట్లతో 9.6 కిలోమీటర్ల ఫోర్‌లేన్ బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఈ క్రమంలో ఇటీవల జరిగిన సమీక్షలో మంత్రి శ్రీధర్‌బాబు గంగాపురి-బోయినిపేట మధ్య హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈఈ బలరామయ్య ఆధ్వర్యంలో అధికారులు, నాయకులు శశిభూషన్‌కాచే, పోలు శివ, శ్రీనివాస్, గుండా రాజు, ముస్కుల సురేందర్‌రెడ్డి, లింగయ్యలు పరిశీలించారు.

అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- 12 తులాల బంగారం, ఒక ద్విచక్రవాహనం సీజ్
- 16 కేసులలో నిందితుడైన మహేశ్‌తో పాటు ఆరుగురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను అరెస్ట్‌చేసి 12తులాల బంగారం, ఒక ద్విచక్రవాహనంను సీజ్‌చేశామని ఎస్పీ మహేశ్ బి గీతే సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పలుజిల్లాల్లో 16కేసులలో నిందితుడిగా ఉన్న జగిత్యాలజిల్లా మెట్‌పల్లి మండలంలోని వెల్లుట్ల గ్రామానికి చెందిన బోదాసు మహేశ్(30), నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని మంచిప్ప గ్రామానికి చెందిన గద్దల స్వప్న, గోత్రాల బాలమణి, కుమార్‌నగర్‌కు చెందిన ఠాకూర్ విశాల్‌సింగ్, జగిత్యాల జిల్లా చల్‌గల్ గ్రామానికి చెందిన నేరెళ్ల శ్రీనివాస్, నేరెళ్ల రాణిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. జగిత్యాల జిల్లా వెల్లుట్లకు చెందిన మహేశ్ నిజామాబాద్ జిల్లాకు చెందిన గద్దల స్వప్న, విశాల్‌సింగ్, జగిత్యాల జిల్లా నెరెళ్ల శ్రీనివాస్, రాణి, గోత్రాల బాలమణి అనేవారితో ఒక ముఠాగా ఏర్పడ్డారన్నారు. ఈ ముఠా రాత్రివేళల్లో తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చేసుకొని ఆర్మూర్, నిజామాబాద్, వేములవాడ, కోనరావుపేట, బోయిన్‌పల్లి ప్రాంతాల్లో దొంగతనం చేయడానికి సరైన సమయం కోసం వేచి చూశారు. ఈ ముఠా ఇదేఏడాది మే2,23తేదీలలో వేములవాడ పట్టణంలోని సాయి నగర్ ప్రాంతంలో దొంగతనానికి పాల్పడ్డారు. మే 11, 16, 25న, జూన్ 2, 7, 161న ఆర్మూర్‌లో, జూన్12న వేములవాడలో దొంగతనాలకు పాల్పడగా సాంకేతికత ఆధారంగా సోమవారం వేములవాడ అర్బన్‌లోని తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరివద్ద 12తులాల బంగారం, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. ఈ దొంగల ముఠాను చాకచక్యంగా పట్టుకున్న వేములవాడ టౌన్‌సీఐ వీరప్రసాద్, ఎస్‌ఐలు అనిల్‌కుమార్, వెంకట్రాజం, కానిస్టేబుల్స్ గోపాల్, పంతులు, లత, సాహెబ్‌హుస్సెన్, దేవేందర్, సంయుద్దిన్‌ను ఎస్పీ అభినందించారు.

దాడి కేసులో ఆరు నెలల జైలు శిక్ష

ఎలిగేడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపల్లి (కట్టకిందిపల్లి) గ్రామానికిచెందిన చింతరెడ్డి రమణారెడ్డి, కొత్తిరెడ్డి రాజిరెడ్డిల మధ్య పాత ఇంటిహద్దుల విషయంలో గొడవల జరిగాయి. కొత్తిరెడ్డి రాజిరెడ్డి, అతని కొడుకు మహేందర్‌రెడ్డి 2016జూన్‌8న పారతో చింతిరెడ్డి రమణారెడ్డిని తలపై కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. రమణారెడ్డి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు అప్పటిఎస్సై ఎండి.రఫీక్‌ఖాన్ విచారణ జరిపి కేసునమోదు చేసినట్లు ఎస్సైసనత్‌కుమార్ తెలిపారు. సుల్తానాబాద్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి గణేష్ ఇరువర్గాల వాదనను విన్న అనంతరం నేరస్తుడు కొత్తిరెడ్డి రాజిరెడ్డి నేరం రుజువు కావడంతో అతనికి 6నెలల జైలుశిక్ష, 500వందల రూపాయల జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.శ్యాంప్రసాదరావు సాక్షులను ప్రవేశపెట్టి నేరాన్ని రుజువు చేశారు. డీసీపీ పి కరుణాకర్, ఏసీపీ గజ్జికృష్ణ పర్యవేక్షణలో సాక్ష్యం ప్రవేశపెట్టడానికి సహకరించిన సుల్తానాబాద్ సీఐ జి.సుబ్బారెడ్డి, జూలపల్లి ఎస్సై సిహెచ్.సనత్‌కుమార్, ఎలిగేడు ఎస్సై తనుగుల సత్యనారాయణ, కోర్టు కానిస్టేబుల్ బృందాన్ని సీపీ అభినందించారు.

వేములవాడలో నలుగురిపై పీడీ యాక్ట్ అమలు

వేములవాడ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న రౌడీ షీటర్స్, పాతకేసులలో ఉన్న నేరస్థులుపై నిత్యం పోలీసునిఘా ఉంటుందని సిరిసిల్ల ఎస్పీ మహేష్ బీ గితే అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గంజాయి, హత్యాయత్నం కేసులలో నిందితులుగా ఉండి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న నలుగురిపై పీడీయాక్ట్ అమలు చేసినట్లు తెలిపారు. వేములవాడ పట్టణానికి చెందిన ఈర్ల సాయి, వస్తాద్ అఖిల్, కోనాయిపల్లికి చెందిన భైరెడ్డి వినయ్, బాలరాజుపల్లి గ్రామానికి చెందిన నేదూరి రాజేష్ గతంలో గంజాయి, హత్యాయత్నం, హత్య కేసులలో నిందితులుగా ఉండి శిక్షలు అనుభవించినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రాకపోగా తరుచూ నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వారు వ్యవహరిస్తున్న తీరును పరిగణలోకి తీసుకుని జిల్లా కలెక్టర్ పీడీ యాక్టు ఉత్తర్వులు జారీ చేయడంతో వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ నలుగురికి పీడీ యాక్టు నిర్బంధ ఉత్తర్వులను అందజేసి వారిని చర్లపల్లి జైలుకు తరలించారన్నారు.

నగల బ్యాగ్ మరిచిపోయి బస్సు దిగిన మహిళ

- పోలీసుల చొరవతో దొరికిన బ్యాగ్



నగలు, నగదును బాధితురాలికి అందజేస్తున్న డీఎం, పోలీసులు

సుల్తానాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా టేకుమట్ల మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన ముంజల సాధన, అత్త, చిన్నారితో కలసి గోదావ రిఖనిలో కరీంనగర్ వెళ్ళే కరీంనగర్ టు డిపో బస్సు ఎక్కి సుల్తానా బాద్‌కు టిక్కెట్టు తీసుకుంది. సోమవారం ఉదయం ఏడున్నర గంటలకు సుల్తానాబాద్ బస్టాండ్‌లో బస్సు దిగారు. బస్సు వెళ్ళిపోయిన అనంతరం తమ నగల బ్యాగు లేని విషయాన్ని గుర్తించిన బాధితులు లబోదిబోమంటూ బస్టాండ్‌లో రోదించారు. వెంటనే సుల్తానాబాద్ పోలీసులను ఆశ్రయించారు. బస్సు టిక్కెట్టుపై ఉన్న బస్సు నంబర్ ఆధారంగా ఏఎస్‌ఐ కొమురయ్య వెంటనే కరీంనగర్ ఆర్టీసీ అధికారులను ఫోన్‌లో సంప్రదించి బస్సుకండక్టర్ లంకదాసరి బాబు నంబర్ కనుక్కొని బాధితులు పోగొట్టుకున్న బ్యాగు విషయమై తెలిపారు. వెంటనే సదరు కండక్టర్ బస్సులో వెతకగా సీటు కింద నగల బ్యాగు దొరికింది. బాధితులను కరీంనగర్ బస్టాండ్ తీసుకువెళ్లి అక్కడఉన్న పోలీసుల, ఆర్టీసీ కంట్రోలర్ సమక్షంలో కండక్టర్ లంకదాసరి బాబుచే నగల బ్యాగు అందజేశారు. బ్యాగులో రెండు బంగారు గొలుసులు, ఒక వెండి మొలతాడు, సెల్‌ఫోన్, నాలుగు ఏటీఎం కార్డులతో పాటు ముప్పై రెండు వేల 671 రూపాయల నగదు ఉంది. బ్యాగు అప్పగించిన కండక్టర్‌ను,బ్యాగును దొరికేలా సహకరించిన ఏఎస్‌ఐ కొమురయ్యను పలువురు అభినందించారు.



కొలువు కొట్టాలంటే..

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

ఇంజనీరింగ్ విద్యతోపాటు అదనపు కోర్సులు

చదువుతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు

గణేశ్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్.. ఒకప్పుడు డిమాండ్ ఉన్నకోర్సు. ఈ చదువు పూర్తయిందంటే ఉద్యోగం వచ్చినట్లే. జీవితంలో స్థిరపడినట్లే. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. కోర్సు పూర్తయినా ఉద్యోగం వస్తుందనే నమ్మకం లేదు. దీనికి ప్రధాన కారణం కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడమే. కోర్సు ఏదైనా కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాల్సిందే.. అప్పుడే కొలువు దక్కుతుంది.

చదువుకు.. చేసే పనికి ఉండని పొంతన..

ఇంజనీరింగ్ కోర్సు పూర్తయిన తర్వాత యువత ఏదో ఒక చిన్న ఉద్యోగంలో చేరుతున్నారు. ఇక్కడ చదువుకు.. చేసేపనికి పొంతనే ఉండడం లేదు. ఎందుకంటే.. ఇంజనీరింగ్ పూర్తయిన తర్వాత ఏం చేయాలనే అంశంపై చాలా మందికి అవగాహన ఉండడం లేదు. ఫలితంగా కొంత మంది హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఇతర ప్రాంతాల్లో ఏదో ఒక చిన్న ఉద్యోగం చేస్తూ కాలం గడుపుతున్నారు. ఇంజనీరింగ్ పూర్తయిన తర్వాత కంప్యూటర్ కోర్సులు చేస్తే ఉద్యోగావకాశాలు ఉంటాయి.

ఉమ్మడి జిల్లాలో ప్రతి సంవత్సరం రెండు వేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఏటా రెండు వేలకుపైగా విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసుకుని బయటకు వస్తున్నారు. వారిలో 20 నుంచి 30 శాతంలోపే క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు పొందుతున్నారు. మిగతా వారు ఇంజనీరింగ్ పట్టాలతో ఉద్యోగాల వేట ప్రారంభిస్తున్నారు.

- **సీఎస్ఈ గ్రూప్ ..**

ఇంజనీరింగ్ సీఎస్ఈ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్) గ్రూప్ పూర్తి చేసిన విద్యార్థులు ఆరు నెలల నుంచి సంవత్సర వరకు ఉండే కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది. బిగ్ డేటా ఎనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులతో ఉద్యోగావకాశాలు ఉంటాయి.

- **ట్రిపుల్ ఈ**

ఈఈఈ (ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) గ్రూప్ పూర్తి చేసిన విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి కూడా వెళ్లే అవకాశం ఉంటుంది. ఈ విద్యార్థులు ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ కోర్సుతోపాటు పవర్ టెక్నాలజీ సోలార్ కోర్సు చేయాలి. ఈ కోర్సులు 3 నెలల నుంచి 6 నెలల వ్యవధిలో ఉంటుంది.

- **సివిల్ గ్రూప్..**

సివిల్ గ్రూప్ చదివిన విద్యార్థులు స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ రివిట్ ఆర్కిటెక్చర్, రివిట్ స్ట్రక్చర్, ఆటో క్యాడ్ కోర్సులు నేర్చుకోవాలి. వీటి ద్వారా ప్రాజెక్టుల్లో ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరడానికి అవకాశాలు ఉంటాయి.

- **ఈసీఈ గ్రూప్..**

ఈసీఈ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్) గ్రూప్ చేసిన వారికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు లభిస్తాయి. ఆండ్రాయిడ్ సిస్టమ్, ఈఎల్ఎస్ఐ డిజైన్స్ కోర్సులతో పాటు బిగ్ డేటా ఎనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్, సైబర్ సెక్యూరిటీ కోర్సులు చేయాలి. ఈ కోర్సులు ఆరు నెలల వ్యవధి కలిగి ఉంటాయి. వీటితోపాటు ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ (ఐఓటీ) కోర్సు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

- **మెకానికల్ గ్రూప్ ..**

మెకానికల్ గ్రూప్ విద్యార్థులు రోబోటిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోకేడ్, కెటియా కోర్సులు చేయాలి. ఇవి మూడు నుంచి ఆరు నెలల కోర్సులు. ఈ కోర్సులు పూర్తి చేస్తే ఇంటర్వ్యూల్లో ప్రాధాన్యం ఉంటుంది.

చదువు పూర్తయిన విద్యార్థులు వెంటనే కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవాలి. హైదరాబాద్‌లో పలు సంస్థలు ఈ కోర్సులు నిర్వహిస్తున్నాయి. అక్కడే అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ఉంటుంది. కోర్సు పూర్తయిన తర్వాత ఇంటర్వ్యూలకు వెళ్లే అవకాశం ఉంటుంది.

ఇంటర్వ్యూలను ఇలా ఎదుర్కోండి..

విద్యార్థులు ఇంజనీరింగ్‌లో 90 శాతం మార్కులు సాధించినా ఇంటర్వ్యూల్లో వెనుకబడుతున్నారు. ప్రధానంగా సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, టెక్నికల్ స్కిల్స్, హ్యూమన్ రిలేషన్స్‌వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. కళాశాలల్లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రెయినింగ్‌కు తప్పనిసరిగా హాజరు కావాలి. ప్రస్తుతం అన్ని కళాశాలల్లో ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నారు.

ఇతర కోర్సులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రొఫెసర్ యు ఉమేష్‌కుమార్, వీసీ, శాతవాహన విశ్వవిద్యాలయం



ఇంజనీరింగ్ విద్యార్థులు బీటెక్‌తోనే ఆగిపోవద్దు. ఎంటెక్ కూడా చేయాలి. ఇతర కోర్సులపై కూడా అవగాహన కలిగి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం, కమ్యునికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి. క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరుకావాలి. చదువుకున్న కోర్సులపై పట్టు ఉండాలి. దీని వల్ల ఇంటర్వ్యూకు వెళ్లినప్పుడు ఆత్మవిశ్వాసంతో జవాబులు ఇవ్వవచ్చు.



అన్న ఇంటిని తగులబెట్టిన తమ్ముడికి ఐదేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అన్నఇంటిని తగులబెట్టిన కేసులో తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన బాలమల్లయ్య అనే తమ్ముడికి అయిదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.1000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి లక్ష్మణాచారి సోమవారం తీర్పు ఇచ్చారు. సిరిసిల్లరూరల్ సీఐ మొగిలి వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్ల గ్రామానికిచెందిన బాలనర్సయ్య తన భార్యతోకలిసి నివాసం ఉంటున్నాడు. అతనికి తమ్ముడు మల్లయ్యతో భూవివాదాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో అన్నపై కక్షపెంచుకున్న మల్లయ్య జూన్ 12, 2019న రాత్రి 11 గంటల సమయంలో నర్సయ్య ఇంటికి వెళ్లి నిప్పు అంటించాడు. ఈ సంఘటనపై బాధితులు నర్సయ్య తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ శేఖర్ కేసు నమోదుచేసి నిందితుడైన మల్లయ్యను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును అడిషనల్ పిపి వేముల లక్ష్మీప్రసాద్ వాదించగా కోర్టు కానిస్టేబుల్స్ నవీన్, రాజేందర్ 8మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అసిస్టెంట్ సెషన్స్ జడ్జి లక్ష్మణాచారి నిందితుడికి అయిదేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం ఆయన వాహన తనిఖీలను నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వాహన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసు తప్పవని హెచ్చరించారు.

గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణిచంద్

జమ్మికుంట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కల్తీఆహారం తిని ఇద్దరు విద్యార్థులు సోమవారం అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం రాత్రి విద్యార్థులు సాంబార్ భోజనం చేశారు. అప్పటి నుంచి 9వతరగతి విద్యార్థులు మణిచంద్, హర్షవర్ధన్‌కు కడుపునొప్పి, వాంతులు మొదలయ్యాయి. మరుసటిరోజు కూడా తగ్గకపోవడంతో ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. పాఠశాలకు చేరుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల పరిస్థితి చూసి ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ ఆహారం పెట్టడం వల్లే అనారోగ్యం బారిన పడ్డారని మండిపడ్డారు. తల్లిదండ్రులు సురేష్-శ్వేత తమ కుమారుడు మణిచంద్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరో పది మంది విద్యార్థులు ఇలానే అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. అయితే ఇద్దరు విద్యార్థులకు మాత్రమే అలా జరిగిందని, మిగితా విద్యార్థులు అందరూ బాగున్నారని వైస్ ప్రిన్సిపాల్ రామ్‌సింగ్ వివరణ ఇచ్చారు. కొంతమంది తల్లిదండ్రులు తమపిల్లలకు ఆదివారం బయటి నుంచి ఫుడ్ తీసుకువచ్చి తినిపిస్తున్నారని ఆయన తెలిపారు. హర్షవర్ధన్‌ను అతని తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం హుజూరాబాద్‌కు తీసుకువెళ్లారు.

వావిలాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి 23మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు.

ప్రభుత్వ ఖజానాకు గండికొట్టిన ఉద్యోగికి మూడేళ్లు జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నకిలీజీతాల బిల్లుల తయారు చేసి ప్రభుత్వ ఖజానాకు గండికొట్టిన ప్రభుత్వ ఉద్యోగికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ. 10వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించారు. సిరిసిల్లటౌన్ సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రైమరీహెల్త్ సెంటర్‌లో బానోతు నరేశ్ సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ప్రభుత్వ ఖజానా నుంచి డబ్బులు కాజేయాలన్న దురుద్దేశంతో జనవరి 2015 నుంచి నవంబరు 2015వరకు వరకు స్టాఫ్ నర్సు మంజుల పేరిట, మార్చి 2015నుంచి నవంబరు 2015వరకు అరుణ అనే స్టాఫ్‌నర్సు పేరిట వారి నెలవారి జీతాలబిల్లులు, లీవ్‌సాలరీ బిల్లుల తయారు చేసి సిరిసిల్ల సబ్ ట్రెజరీ కార్యాలయానికి పంపించాడు. దీంతో రూ.12లక్షలు విత్ డ్రా చేసి జీతం మినహాయింపు రూ. 1,06,194 ఇచ్చిమిగితా రూ.11,05,514 తన ఎస్‌బీహెచ్ బ్యాంకు ఖాతానందు జమచేసుకొని సొంతానికి వాడుకున్నాడు. అయితే స్టాఫ్ నర్సులు మంజులత, అరుణ గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో పని చేయడం లేదని వారు వేరేచోట పనిచేస్తే వారి జీతాల బిల్లులు సంబంధిత ట్రెజరీ ద్వారా డ్రా చేసుకున్నట్లు ఉమ్మడి కరీంనగర్ ట్రెజరీ ఉపసంచాలకుల విచారణలో తేలింది.

ఆయా ఉద్యోగుల జీతాలు జీపీఎఫ్ మినహాయింపులు రెండింతలు రావడంతో అకౌంటెంట్ జనరల్ డిపార్ట్‌మెంట్ వారు గమనించి సంబంధిత అధికారులతో తెలిపారు. విచారణలో సీనియర్ అకౌంటెంట్ బానోత్‌నరేశ్ మోసానికి పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. నరేశ్ సంబంధిత శాఖ వారికి ఎటువంటి అనుమానం రాకుండా తన డ్రాయింగ్ అండ్ డిశ్బార్డ్‌మెంట్ అధికారి డాక్టర్ రమేశ్ సంతకాలతో కూడిన బిల్లులను పెట్టడంతో మంజూరు చేశారు. ఇందుకు సిరిసిల్ల సబ్ ట్రెజరీ సిబ్బంది సంబంధిత బిల్లులు మంజూరు చేసిన సీనియర్ అకౌంటెంట్‌లో గానీ ఎస్టీఓ వారు మోసం గుర్తించలేక బిల్లులు మంజూరు చేశారు.

ఈ విషయమై వెంటనే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిటీఓ కె. శ్రీనివాస్ సంబంధిత అధికారుల మోసాలపై సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి సీఐ విజయ్‌కుమార్ కేసు నమోదుచేసి నిందితుడైన బానోతు నరేశ్‌పై కోర్టులో చార్జీ షీట్ దాఖలుచేశారు. ఈ కేసులో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ కోర్టులో ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టగా పిపి సందీప్ కేసు వాదించగా పూర్వాపరాలను పరిశీలించిన సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ నిందితులపై నేరం రుజువు కావ డంతో సీనియర్ అకౌంటెంట్ బానోతు నరేశ్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 10వేల జరిమానా విధించారు.

మోహన్ రెడ్డిపై కేసు కొట్టివేత

కరీంనగర్ లీగల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆవరణలో సాక్షులను బెదిరింపులకు గురిచేశారనే ఆరోపణలతో మోహన్‌రెడ్డిపై నమోదు చేసిన కేసును సోమవారం కరీంనగర్ పీసీఆర్ కోర్టు కొట్టివేసింది. ఫైనాన్స్ కేసుల్లో సాక్షులను కోర్టు ఆవరణలో బెదిరింపులకు గురిచేస్తున్నారని కామారపు జ్ఞానేశ్వర్ అనేవ్యక్తి 24నవంబరు 2017న మాజీఎస్సై బొబ్బల మోహన్‌రెడ్డి, బొబ్బల లత, బానాల రమణారెడ్డి, అజీజ్, చెక్కుల రాజమల్లు, శ్రీపాల్‌రెడ్డిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు విచారించిన కోర్టు మోహన్‌రెడ్డితో పాటు మిగితావారందరిపై కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

బైక్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు

- ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం అర్కండ్ల గ్రామశివారులో మోడల్ స్కూల్‌కు విద్యార్థులను తీసుకెళ్లే బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్కండ్ల గ్రామానికి చెందిన నేదురు సమ్మయ్య వ్యక్తిగత పనుల నిమిత్తం అర్కండ్ల నుంచి గంగిపెల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎరడపల్లి నుంచి ఎదురుగా వస్తున్న స్కూల్ బస్సు అర్కండ్ల శివారులో బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న సమ్మయ్యకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే సమ్మయ్యను కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గల్లంతయిన మత్స్యకారుడి మృతదేహం లభ్యం



రవి(ఫైల్)

గన్నేరువరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): లోయర్ మానేరుడ్యాంలో ఆదివారం చేపల వేటకు వెళ్లి గల్లంతయిన మండలంలోని మైలారం గ్రామానికిచెందిన మత్స్యకారుడు గువ్వ రవి మృతదేహం సోమవారం ఉదయం మత్స్యకారుల గాలింపులో లభించింది. మత్స్యకారులు తెప్పపై మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చారు. మృతదేహాన్ని చూసి మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

రైతును కాటేసిన పాము

ఇల్లంతకుంట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండంలోని రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన అంతగిరి శ్రీనివాస్ అనే రైతు పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. శ్రీనివాస్ సోమవారం పొలం వద్ద వ్యవసాయ పనులు చేస్తుండగా పాముకాటు వేసింది. దీనితో అతన్ని ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- కుటుంబసభ్యులతో మాట్లాడించి కిందికి దించిన సీఐ



గోపాల్‌ను కిందికి దించి తీసుకువెళ్తున్న సీఐ రాంనర్సింహారెడ్డి

ధర్మపురి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో భార్యతో గొడవపడి గాడిపెల్లి గోపాల్ అలియాస్ గోపి(42) అనే వ్యక్తి సోమవారం సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఫైర్‌స్టేషన్ అధికారి శ్రీకాంత్ తదితరులు ఘటనాస్థలానికి చేరుకుని భార్య, కూతురుతో మాట్లాడించి గోపిని కిందికి దించారు. సీఐ రాంనర్సింహారెడ్డి కథనం ప్రకారం.. ధర్మపురి పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన గాడిపెల్లి గోపాల్ టెంట్‌హౌస్‌లో కూలీగా పని చేస్తున్నాడు. గోపాల్‌కు భార్య నర్సమ్మ, కూతురు, కొడుకు ఉన్నారు. మద్యానికి బానిసైన గోపాల్ సోమవారం భార్య నర్సమ్మతో గొడవ పడి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సీఐ రాంనర్సింహారెడ్డి వైర్‌లెస్ మైక్ ద్వారా గోపాల్ కూతురు, భార్యతో మాట్లాడించారు. వెంటనే గోపాల్ తనచేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను కింద పడవేశాడు. అనంతరం గోపాల్‌కు సీఐ నచ్చజెప్పడంతో గంట తరువాత టవర్ పైనుంచి కిందికి దిగాడు. వెంటనే గోపాల్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి వ్యక్తి ప్రాణాలు కాపాడిన సీఐ రాంనర్సింహారెడ్డిని, ఫైర్ సిబ్బందిని ప్రజలు అభినందించారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

సిరిసిల్ల క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో గల బెల్ట్ షాప్‌లపై టౌన్‌ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమ వారం రాత్రి ఆకస్మిక దాడులు చేశారు. గ్రామంలోని బత్తిని చంద్రయ్య ఇంట్లో, ఎల్లంకి శ్రీనివాస్ కిరాణ దుకాణంలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌లపై దాడిచేసి మూడుబాక్స్‌ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బెల్ట్‌షాప్ నడుపుతున్న బత్తిని చంద్రయ్య, ఎల్లంకి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'వ్యవసాయ యాంత్రీకరణ'కు తుప్పు

- మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో రూ.20.15 లక్షలతో యంత్రాలు కొనుగోలు
- రైతులకు అవగాహన కల్పించని అధికారులు
- షెడ్లు దాటని వైనం



సత్తక్కపల్లిలోని షెడ్డులో తుప్పు పట్టిన వరి నాటు యంత్రం

మెట్‌పల్లి రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో లక్షల వ్యయం చేసి కొనుగోలు చేసిన వ్యవసాయ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. రైతులకు తక్కువ ధరకే వ్యవసాయ యంత్రాలను అద్దెకు ఇవ్వడానికి గత ప్రభుత్వం 2021-22 ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాల ద్వారా మెట్‌పల్లి మండలం కస్టమర్ హైరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయించింది. 20.15 లక్షలతో ట్రాక్టర్, ట్రాలీ, రోటవేటర్, కల్టివేటర్, వరి నాటు, స్ప్రే యంత్రాలను కొనుగోలు చేశారు. వీటిపై మూడు సంవత్సరాల్లో వచ్చిన ఆదాయం 3.78 లక్షల రూపాయలు మాత్రమే. ఏడు లక్షలు వెచ్చించి వరి నాటు యంత్రాన్ని కొనుగోలు చేశారు. దీన్ని కిరాయికి ఇవ్వగా నిర్వహణ ఖర్చులు తీసివేయగా 2,300 రూపాయలు నష్టం వచ్చినట్లు అధికారులు చూపించారు.

రైతులు ఆసక్తి చూపడం లేదు: విమోచన, మెట్‌పల్లి మండల సమాఖ్య అధికారి

ప్రతీ నెల మహిళా సంఘాల సమావేశాల్లో తీర్మానాలు చేస్తున్నాం. అయినా యంత్రాలను వినియోగించుకోవడానికి రైతు లు ఆసక్తి చూపడం లేదు. రైతులు ఉపయోగించుకుంటే లాభం వస్తుంది. ఎవరూ ముందుకు రాకపోవడంతో అవసరమైన వారికి తక్కువ రేటుకైనా ఇస్తున్నాం.

వరి నాటు యంత్రంపై రూ.2,300 నష్టం

రైతులు ఎకరం పొలంలో వరి నాటు వేయాలంటే ఆరు వేల నుంచి ఏడు వేలకు వరకు ఖర్చు అవుతుంది. అదే వరి నాటే యంత్రం వినియోగిస్తే సమయం, ఖర్చు ఆదా అవుతుంది. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చిన్న ట్రాలీతో కూడిన వరి నాటు యంత్రాన్ని ఏడు లక్షల రూపాయలతో కొనుగోలు చేసింది. దీన్ని రెండు సంవత్సరాల క్రితం చింతలపేట గ్రామానికి చెందిన రైతు వినియోగించుకున్నాడు.

అతడి నుంచి ఆదాయం 12 వేల రూపాయలు మాత్రమే వచ్చింది. దానిపై నిర్వాహకులు మాత్రం 14,300 ఖర్చు చేసినట్లు చూపించారు. దీంతో వచ్చిన ఆదాయం కంటే 2,300 రూపాయలు నష్టం చూపుతున్నారు. అప్పటి నుంచి సత్తక్కపల్లి గ్రామంలోని ఓ రైతు షెడ్డులో వరి నాటుతో పాటు స్ప్రే యంత్రాలను ఉంచడంతో తుప్పు పట్టి ఎందుకు పనికి రాకుండా పోయాయి. దీనిపై మండలంలో ఆశించిన స్థాయిలో సెర్ప్ అధికారులు అవగాహన కల్పించలేదు. మహిళా సంఘాల సమావేశాల్లో అధికారులు తీర్మానాలు చేసి చేతులు దులుపుకున్నారు. లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన యంత్రాలు నిరుపయోగంగా మారడంతో మహిళా సమాఖ్య పెట్టిన నిధులు రావడం కష్టంగా మారిందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పాల్గొన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమీకృత కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆధ్వర్యంలో మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన బోయినపల్లి మండలం కొదురుపాక వరద వెల్లి, నీలోజిపల్లి గ్రామాలకు చెందిన నిర్వాసితులతో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ గ్రామాల వారీగా నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లకు పరిహారం రాలేదని, యువతకు పరిహారం రాలేదని కమ్యూనిటీ హాళ్లు, ఆలయాలు, ఆర్టీసీ బస్‌షెల్టర్లు, స్కూల్ బిల్డింగ్ పరిహారాలు రాలేదని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడారు. మానవతా దృక్పథంతో అందరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులందరికీ పరిహారం వచ్చేలా కృషి చేస్తానన్నారు. దరఖాస్తులపై మరోసారి అధికారులతో సర్వే చేయిస్తానని అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. కొదురుపాకలో గురువారం, వరదవెల్లిలో శుక్ర వారం, నీలోజిపల్లిలో శనివారం, రెవెన్యూ అధికారులు ప్రత్యే శిబిరం ద్వారా సమావేశాలు నిర్వహించి నిర్వాసితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని 15 రోజులలో అర్హులైన వారి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. గ్రామాల నిర్వాసితులు తమ సమస్యలపై దరఖాస్తులు చేసుకోవాలని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా హామీనిచ్చారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో ఎస్డీసీ రాధాబాయ్, బోయినపల్లి తహసీల్దార్ నారాయణరెడ్డి, కలెక్టర్ పర్యవేక్షకులు శ్రీకాంత్, నిర్వాసితులు పాల్గొన్నారు.



ప్రాజెక్టులో తేలిన బండలు

నీరు లేక మిడ్ మానేరు వెలవెల

ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టుల పైనే ఆశలు

బోయినపల్లి జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల వర్షాకాలంలో జూన్ మాసం ముగిసింది. వర్షాలు లేక పోవడంతో రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులకు నీటిని తరలించేందుకు గుండెకాయగా మారిన మిడ్ మానేరు ప్రస్తుతం నీరు లేక వెలవెల బోతోంది. జూన్ నెల ముగియగా ప్రాజెక్టులోకి చుక్క వరద నీరు కూడా చేరలేదు. మిడ్ మానేరు ఎగువ భాగాన సైతం ఆశించిన వర్షాలు కురువకపోవడం మానేరు, ములవాగు ప్రవహించ పోవడంతో ప్రాజెక్ట్‌లోకి వరద నీరు రాలేదు.

లోయర్ మానేరు, అనంతగిరి, రంగనాయక సాగర్, కొండ పోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టు సైతం ప్రధానంగా మిడ్ మానేరుపైనే ఆధారం. మిడ్ మానేరు పూర్తి స్థాయిలో నిండు కోవాలంటే కాళేశ్వరం నుంచి నీటిని తరలించే అవకాశం లేకపోవడంతో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులపైనే ఆశలు ఉన్నాయి. మిడ్ మానేరు నీటి సామర్థ్యం 27.55 టీఎంసీలకు ప్రస్తుతం 6.92 టీఎంసీ నీరు ఉంది.

నేడు బాబ్లీ గేట్ల ఎత్తివేత

ఎస్సారెస్పీకి పైన నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మహారాష్ట్ర, తెలంగాణ ఇరిగేషన్ శాఖ అధికారులు జూలై 1నుంచి అక్టోబరు 28 వరకు తెరిచి ఉంచుతారు. దీంతో మహారాష్ట్రలో భారీ వర్షాలు కురిస్తే ఎస్సారెస్పీ త్వరితగతిన నిండుతుంది. అక్కడి నుంచి ఇందిరమ్మ వరద కాలువ ద్వారా ఎత్తిపోతలు లేకుండా వరద నీరు మిడ్ మానేరులోకి చేరుకుంటుంది.

ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశం

కడెం ప్రాజెక్టు నిండితే అక్కడి వరద నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వస్తుంది. అక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా నంది మేడారం అక్కడి నుంచి గాయత్రి పంప్‌హౌస్ ద్వారా మిడ్ మానేరుకు తరలించే అవకాశం ఉంటుంది.



ఇందిరమ్మ వరద కాలువ

బెల్ట్ షాప్ తొలగించాలని మహిళల ఆందోళన



బెల్ట్ షాప్‌ను తొలగించాలని పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన కాలనీవాసులు

సిరిసిల్ల క్రైం జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట శివారులో గల కరీంనగర్ రహదారి పక్కన ఉన్న ఒడ్డెర కాలనీలో బెల్ట్‌షాప్ తొలగించాలని సోమవారం కాలనీ మహిళలు ఆందోళన చేశారు. తమ కాలనీలో ఉన్న బెల్ట్‌షాప్‌ను వెంటనే తీసివేయాలని కాలనీకి చెందిన మహిళలు పోలీస్‌స్టేషన్‌కు, ఎక్సైజ్‌స్టేషన్‌కు తరలివచ్చి వినతిపత్రం అందజేశారు. కాలనీలో కొంతమంది వ్యక్తులు కలిసి బెల్ట్‌షాప్ ఏర్పాటు చేసి మద్యం అమ్మకాలు చేస్తున్నారని, మద్యం తాగేవారి వల్ల మహిళలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే బెల్ట్ షాప్ తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.

అసత్య ప్రచారం చేస్తే చర్యలు

సిరిసిల్ల క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో బెల్ట్ షాప్ నడుపుతున్నట్లు అసత్య ప్రచారం చేస్తే చర్యలు తప్పవని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. సోమవారం చంద్రంపేటలోని ఒడ్డెర కాలనీకి వెళ్లి తనిఖీలు చేయగా ఎలాంటి బెల్ట్ షాప్ నడుపడం లేదని తేలిందని తెలిపారు. ఇలాంటి అసత్య ప్రచారాలు చేసినా, చట్ట వ్యతిరేక పనులకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే చంద్రంపేటకు చెందిన కొంత మంది మళ్లీ బెల్ట్‌షాప్‌లను నడుపుతున్నట్లు చెబుతూ ఆ సెంటర్‌లో న్యూసెన్స్‌కి కారణం అవుతున్నారన్నారు. గత నెల రోజుల క్రితం చంద్రంపేటలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నట్లు తెలుసుకొని సంపంగి లక్ష్మిని బైండోవర్ చేశామన్నారు. గతంలో బెల్ట్ షాప్ నడుపుతున్నారని చంద్రంపేటలోని ఒడ్డెర కాలనీకి చెందిన సంపంగి మల్లవ్వ, సంపంగి లక్ష్మీ, సంపంగి రాధ, సంపంగి రాజలింగంలను ఫిబ్రవరి 13న బైండోవర్ చేశామన్నారు. ఇప్పటివరకు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో సంపంగి మల్లవ్వపై 6, సంపంగి లక్ష్మిపై 7, సంపంగి రాధపై 2, సంపంగి రాజలింగంపై 1 కేసు నమోదై ఉందన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి వారి కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పుణ్య స్నానాలు ఆచరించారు. క్యూలైన్ల ద్వారా వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులను చెల్లించుకున్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

నేతన్న చౌక్‌వద్ద కూలిన వృక్షం

త్రుటిలో తప్పిన ప్రమాదం

సిరిసిల్ల క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల నేతన్న చౌక్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ సమీపంలో సోమవారం రాత్రి భారీ వృక్షం నేల కూలింది. తృటిలో ప్రమాదం తప్పింది. అయితే ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురువడంతో ఏళ్ల నాటి పురాతన వృక్షం విరిగి నేలపై కూలింది. చెట్టు కూలిన సమయంలో వర్షం పడడంతో అటువైపుగా వెళ్తున్న కొంతమంది ప్రజలు తప్పించుకుని ప్రమాదం నుంచి బయటపడ్డారు. చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నేలకూలిన వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఈదురు గాలులతో తెగిన కరెంటు తీగలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మండల కేంద్రంలోని పాత బస్టాండు, విద్యుత్తు సబ్‌స్టేషన్ ఆవరణలో భారీగా వీచిన గాలులకు కరెంటు తీగలు రాపిడి జరిగి నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. ఒక్కసారిగా భారీ శబ్ధం రావడంతో బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు భయాందోళనతో పరుగులు తీశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వల్ల ప్రమాదం తప్పినట్లయింది.

ప్రైవేటు స్కూల్ బస్సులను అడ్డుకున్న గ్రామస్థులు

- సర్కారు బడిని బతికించుకుంటామన్న మహిళా సంఘాలు
- రెండు గంటలపాటు రోడ్డుకు అడ్డంగా బైఠాయించి ఆందోళన



ఉల్లంపల్లిలో ఆందోళన చేస్తున్న మహిళలు

చిగురుమామిడి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో సోమవారం వివిధ గ్రామైక్య మహిళాసంఘాల ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల బస్సులను అడ్డుకొని అందు లోని విద్యార్థులను కిందికి దించారు. రెండు గంటలపాటు స్కూల్ బస్సులను కదలనీయకుండా రోడ్డుకు అడ్డంగా బైఠాయించి ఆందోళన చేశారు. కొద్ది రోజుల క్రితం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గ్రామంలోని మహిళా సంఘాలకు, నాయకులకు ప్రభుత్వబడుల ఆవశ్యకతను వివరించారు. దీంతో సోమవారం నుంచి గ్రామంలోని అన్ని మహిళా సమైక్య సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రభుత్వబడిని బతికించుకుందామని ప్రతిజ్ఞ చేశారు. గ్రామం నుంచి దాదాపు 30మంది విద్యార్థులు సమీపం లోని హుస్నాబాద్ ఇతర ప్రైవేటు పాఠశాలలకు బస్సులలో వెళుతున్నారు. గ్రామస్థులందరూ ఏకమై ఆయా పాఠశాలల బస్సులను గ్రామానికి రానివ్వవద్దని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా సోమవారం గ్రామానికి వచ్చిన స్కూల్ బస్సులను అడ్డుకున్నారు. గ్రామానికి రావద్దని బస్సు డ్రైవర్లను హెచ్చరించారు. అడ్డుకున్న వారిలో బీఆర్ ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ నాయకులు, మాజీసర్పంచులు, ఎంపీటీసీ, మహిళాసంఘాల సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్, యువజన సంఘాలు, గ్రామస్థులు తదితరులున్నారు.

సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక పోస్ట్‌లు

ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వానికి వ్యతి రేకంగా పోస్టులు పెట్టిన రంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని శేర్‌లింగంపల్లికి చెందిన దుర్గం శశిధర్‌గౌడ్ అలియాస్ నల్ల బాలు (38)ను సోమవారం కరీంనగర్ సైబర్ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేశారు.

అనంతరం నిందితుడిని కరీం నగర్‌కు తీసుకొచ్చి, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. శశిధర్‌గౌడ్‌ను అరెస్టు చేశారనే విషయం తెలుసుకున్న కరీంనగర్ బీఆర్‌ఎస్ నాయకులు పలువురు పోలీస్ కమిషనరేట్ వద్దకువెళ్లి నిరసన తెలిపారు.

ముల్కనూర్ బ్యాంకు అధ్యక్షుడిగా ప్రవీణ్‌రెడ్డి ఎన్నిక



మాట్లాడుతున్న అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

భీమదేవరపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ముల్కనూర్ సహకార బ్యాంకు అధ్యక్షుడిగా అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ముల్కనూర్ బ్యాంకు అధ్యక్ష ఎన్నిక జరిగింది. ప్రవీణ్‌రెడ్డి ఒక్కరే అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి కోదండరాములు ప్రకటించారు. అనంతరం ప్రవీణ్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు.ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ 1987 నుంచి తాను ముల్కనూర్ సహకార బ్యాంకు అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తున్నట్లు తెలిపారు. తన ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు కొత్తగా ఎన్నికైన డైరెక్టర్లు ప్రవీణ్‌రెడ్డి, బొల్లంపల్లి కుమారస్వామి, గణవేన శ్రీనివాస్, గుర్రాల భాస్కర్‌రెడ్డి, కాసిరెడ్డి వసంతలతో ఎన్నికల అధికారి కోదండరాములు ప్రమాణస్వీకారం చేయించారు. ముల్కనూర్ బ్యాంకు ఉపాధ్యక్షుడిగా గజ్జి వీరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి కోదండరాములు గజ్జి వీరయ్యతో ప్రమాణస్వీకారం చేయించారు.

చిన్నపాటి వర్షాలకే చిత్తడయిన రోడ్లు





కోర్కల్-శ్రీరాములపేట గ్రామాల మధ్య రోడ్డుపై ఏర్పడిన గుంతలు, రెడ్డిపల్లిలో అధ్వాన్నంగా రోడ్డు

వీణవంక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోడ్లు అధ్వానంగా మారాయి. జమ్మికుంట-కరీంనగర్ ప్రధాన రహదారిలో ప్రయాణం ప్రమాదకారంగా మారింది. రాత్రి వేళలో ప్రయాణించే ప్రయాణికులు తరుచు ప్రమాదాలకు గురవుతున్నారు. రెడ్డిపల్లి, కోర్కల్, చల్లూరు, మాల్లారెడ్డిపల్లి గ్రామాల రోడ్లు పూర్తిగా ధ్వంస మవడంతో భారీ గుంతలు ఏర్పాడ్డాయి. చిన్నపాటి వర్షాలకే నీరు నిండడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ప్రతి రోజు వందలాది ఇసుక లారీలు, ట్రాక్టర్లు ప్రయాణించడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అధికారులు రోడ్ల మరమతులపై దృష్టి సారించడం లేదని మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్న వర్షాలకే పరిస్థితి ఇలా ఉంటే భారీ వర్షలు కురుస్తే ఇంకెంత దెబ్బతింటాయోనని ఆందోళన చెందుతున్నారు.



విద్యార్థులకు వరం ఇన్‌స్పైర్ మనక్

- అవార్డులకు దరఖాస్తులు ప్రారంభం
- చిన్నారులను భావి శాస్త్రవేత్తలుగా తయారు చేసే కార్యక్రమం
- 6నుంచి 12 తరగతులకు అవకాశం
- సెప్టెంబరు 15 వరకు గడువు

కరీంనగర్ టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ చర్యలు చేపట్టింది. శాస్త్ర, సాంకేతిక ఆలోచనలు, సృజనాత్మకత వైపు మళ్లించే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్ (ఇన్‌స్పైర్) మనక్ అవార్డు (2025-26)కు సంబంధించి.. విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. జూన్ 15న ప్రారం భమైన దరఖాస్తుల ప్రక్రియ సెప్టెంబరు 15 వరకు కొనసాగనుంది. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ, రెసిడెన్షియల్, ఎయిడెడ్ పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించింది.

దరఖాస్తు ఇలా చేసుకోవాలి..

ఇన్‌స్పైర్ మనక్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ సూచిస్తోంది. ఇందుకోసం www. inspireawards. gov.in వెబ్‌సైట్లోకి వెళ్లి రిజిస్ట్రేషన్ ఆప్షన్ ఎంచుకోవాలి. పాఠశాలలకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకొని సేవ్ చేయాలి. ఈ దరఖాస్తు జిల్లా అథారిటీకి వెళ్తుంది. జిల్లా అథారిటీ ఆమోదిస్తే 24 గంటల్లోపు విద్యార్థికి సంబంధించిన మెయిల్ ఐడీకీ యూజర్ ఐడీతో ఉన్న లింక్ వస్తుంది. అప్పుడు యూజర్ ఐడీకి పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. విద్యార్థి తన సమాచారం, బ్యాంకు అకౌంట్, ఐఎఫ్ఎస్సీ కోడ్, ఆధార్ కార్డు నంబర్, విద్యార్థి ప్రదర్శించాలనుకున్న ప్రాజెక్టు సంక్షిప్త రిపోర్టు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. విద్యార్థులు ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబరు 15 వరకు అవకాశం ఉంది. విద్యార్థులు తాము చదువుతున్న పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయులతో కలిసి ఆన్‌లైన్‌లో ప్రాజెక్టు వివరాలు నమోదు చేసుకోవాలి.

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలు

విద్యార్థులకు తమకు వచ్చిన ఆలోచనలతో తయారు చేసిన ప్రాజెక్టులు ప్రదర్శించేందుకు ఎంపికైతే వారి అకౌంట్లలో 10 వేల రూపాయలు జమచేస్తారు. వాటిని జిల్లా స్థాయి పోటీల్లో ప్రదర్శిస్తారు. జిల్లా స్థాయిలో ఎంపికైతే రాష్ట్ర స్థాయిలో ప్రదర్శిస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించిన ఆరు ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి జాతీయ స్థాయికి పంపుతారు. జాతీయ స్థాయి ప్రాజెక్టులను ఢిల్లీలో ప్రదర్శించడంతోపాటు రాష్ట్రపతి భవన్‌లోనూ ప్రత్యేకంగా ప్రదర్శిస్తారు. అనంతరం సకురా ప్రోగ్రామ్ ద్వారా జపాన్‌లోని పరిశోధన కేంద్రాలను సందర్శించేందుకు ఎంపికైన విద్యార్థులను పంపుతారు.

ఐడియా బాక్స్

అన్ని పాఠశాలల్లోని విద్యార్థుల వినూత్న ఆలోచనలను ఉపాధ్యాయులు గుర్తించేందుకు ఐడియా బాక్స్ ఏర్పాటు చేసుకోవాలి. పరిసరాల్లో ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఈ వేదిక ద్వారా పరిష్కారానికి అవకాశం ఉంది. ప్రతీ పాఠశాల నుంచి కచ్చితంగా ఐదు ప్రాజెక్టులు నామినేషన్ చేసుకోవాలి. ఇన్‌స్పైర్ మనక్ విద్యార్థులకు ఒక వరం వంటిది. శాస్త్రవేత్తలుగా ఎదగాలని కోరుకునే విద్యార్థులకు ఎంతగానో దోహదం పడుతుంది. సామాజిక సమస్యలకు శాస్త్రీయ రూపంలో పరిష్కారం చూపగలిగే సృజనాత్మక ప్రాజెక్టులను నమోదు చేయాలి. అందుకు సైన్స్ ఉపాధ్యాయులు సహకరించాలి.

మా భూములకు నష్టపరిహారం చెల్లించాలి

కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న వీర్నపల్లి మండల రైతులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన 9వ ప్యాకేజీ పనులకు తీసుకున్న భూములకు నష్టపరిహారంతో పాటు ఆన్‌లైన్‌లో ఆ భూములకు విముక్తిని కల్పించి న్యాయం చేయాలంటూ రైతులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి ధర్నా చేపట్టారు. వీర్నపల్లి మండలంలో ప్యాకేజీ 9లో భూములు కోల్పోయిన రైతులు కలెక్టరేట్ జంక్షన్‌కు చేరుకుని కలెక్టరేట్ ప్రధాన ద్వారం వరకు ర్యాలీ నిర్వహించి బైఠాయించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్‌ఝాను కలిసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాల్లారపు అరుణ్‌కుమార్, పిట్ల నాగరాజు, రాజేశం, దేవయ్య, నర్సయ్య, శంకర్, రాజారాం, లింబయ్య, అనిల్, అంజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

'కస్తూర్బా'లకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

గతంలో వేసిన రంగులు కాకుండా మన ఊరు మన బడి పథ కంలో భాగంగా ప్రభుత్వం సూచించిన వైట్ కలర్‌తో పాటు బ్లూ కలర్ వేస్తున్నారు. అదనపు మరుగుదొడ్లు, బాత్‌రూంలు, అదనపు డార్మెంటరీలు, వంట షెడ్లు, స్పోర్ట్స్ కోర్టుల నిర్మాణాలు, సెప్టిక్ ట్యాంకులు, మురికి కాలువలు, కొత్త పైపులు అమర్చడం, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, ఆర్‌ఓ ప్లాంట్ల కోసం ఎలక్ట్రికల్ వైరింగ్ మార్చడం, ఇతర పనుల కోసం కోటి 69 లక్షల రూపాయలు ప్రతిపాదిస్తే ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా 81 లక్షల 45 వేల 800 రూపాయలు మంజూరు చేసిందని జీసీడీవో గడ్డం కవితా రెడ్డి ఆంధ్రజ్యోతికి తెలిపారు. అలాగే విద్యార్థులు వేడి నీళ్లతో స్నానాలు చేసేందుకు ఐవీఐ వాటర్ హీట్ పంపులను కూడా ఏర్పాటు చేశారని చెప్పారు. పనులు చకచకా నడుస్తున్నాయని తెలిపారు.

కుల సంఘాలకు అండగా ఉంటా

(5వ పేజీ తరువాయి)

లేదన్నారు. కేంద్రానికి దమ్ముంటే అవినీతికి పాల్పడి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిన కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై ఇప్పటికైనా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మేడారంలో పలు అభివృద్ధి పనులను కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. గ్రామంలో 261 విద్యుత్ పోల్స్ తరలింపునకు రూ.26 లక్షలు, లూజ్ వైర్ మర మ్మతులకు రూ.14 లక్షలు, అంతర్గత సీసీ రోడ్ల కోసం 8 లక్షల రూపాయలు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. మేడారం కోర్టు నుంచి కటికెనపల్లి వరకు సీసీ రోడ్డు పనులు నెల రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకిచ్చి మహిళలు ఆదాయం సమకూర్చడం హర్షనీయమన్నారు. అనంతరం 42 స్వశక్తి సంఘాల మహిళలకు బ్యాంక్ లింకేజి ద్వారా ఐదు కోట్ల తొమ్మిది లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఆర్‌డీఓ బి.గంగయ్య, పీడీ హౌసింగ్ రాజేశ్వర్‌రావు, ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చైర్మెన్ అరిగె లింగయ్య, మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, డీటీ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మండల దివ్యాంగులు వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరుతోపాటు ట్రై సైకిళ్లు, మొబైల్ ఆటోలు, 5జీ ఫోన్స్ మంజూరు చేయాలని కోరారు. సెకండ్ ఏఎన్ఎంలు వినతి పత్రం అందజేశారు.

అర్హులైన ప్రతీ పేద వారికి సంక్షేమ పథకాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జూన్ 30: (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ పేద వారికి ఇందిరమ్మ ఇళ్ళు, రేషన్ కార్డులు మంజూరు చేయించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే చింత కుంట విజయరమణారావు అన్నారు. ఐతరాజుపల్లి, భూపతిపూర్ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ముగ్గులు పోసి మంజూరు పత్రాలను, కొత్త రేషన్ కార్డులను ఎమ్మెల్యే అందజేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు రాలేదని ఎవరూ బాధపడకూడదని, దశల వారీగా అందరికీ మంజూరు చేస్తామని అన్నారు. భూపతిపూర్ ఎస్సీ కాలనీకి చెందిన పలువురు యువకులు తమకు గుంట భూమి లేదని, ఎలాంటి ఆస్తులు లేవని, మాకు ఇల్లు రాలేదని ఎమ్మెల్యే దృష్టికి తేగా రెండో దశలో మీకు ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అండగా నిలిచి వారిని గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలమే అయినా తాము ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేశామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఉపయోగపడలేదన్నారు. తెలంగాణలో సన్న బియ్యం ఇచ్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిదేనని, దేశంలో ఎక్కడా ఈ పథకం లేదన్నారు. ఐతరాజుపల్లి రామాలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, పన్నాల రాములు, దామోదర్ రావు, రాజలింగం, బక్కయ్య, చిన్నయ్య, వెంకటరమణారావు,పోచంపల్లి రాజు, చిలుక సతీష్, గుజ్జేటి వెంకన్న, చక్రదర్, డీఈఈ దేవేందర్, ఎంపీడీఓ దివ్యదర్శన్ రావు, ఏఈ సచిన్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తిచేసుకోవాలి


కొత్తపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్

పాలకుర్తి,జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొదటి దశలో 453 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, నెల రోజుల్లో వాటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని, డబ్బులను ఇప్పించే బాధ్యత తనదని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. సోమవారం పాలకుర్తి, కొత్తపల్లె, ఎల్కలపెల్లి గేట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ముగ్గులు పోసి నిర్మాణ పనులను ఎమ్మెల్యే సతీ మణి మనాలి ఠాకూర్‌తో కలిసి ప్రారం భించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదా రులు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకొని సొంతింటి కలను నెరవేర్చుకోవా లన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ఎక్క డ ఎలాంటి అవకతవకలకు తావివ్వకుం డా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు లు జమ అవుతాయన్నారు. పార్టీ మం డల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, నాయ కులు బయ్యపు మనోహర్ రెడ్డి, సజ్జన, పర్శవేణి శ్రీనివాస్‌యాదవ్, పొన్నం సత్తయ్యగౌడ్, శ్రీనివాస్, ఎంపీడీవో కలికోట రామ్‌మోహన చారి, పీఆర్ ఏఈ రుషికేష్,మల్లెత్తుల కుమార్,కోటేష్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి


మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ గుజ్జుల రామక్రిష్ణారెడ్డి

సుల్తానాబాద్, జూన్ 30: (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా బీజేపీని ప్రజలు ఆదరిస్తున్నారని జాతీయ కౌన్సిల్ మెంబర్, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి అన్నారు. సోమవారం వైశ్యభవన్‌లో నిర్వహించిన ముఖ్య నేతల కార్యకర్తల సమావేశంలో గుజ్జుల పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో అభ్యర్థులను గెలిపించుకోవడంపై సమీక్షించా రు. అనంతరం విలేకరులతో మాట్లాడుతు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ప్రజలు బీజేపీ వైపు ఆసక్తి చూపుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో విఫలమయ్యారన్నారు. జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు వనజ, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్‌రావు, కార్యదర్శి సౌదరి మహేందర్ యాదవ్, మాజీ జడ్పీటీసీ గుర్రాల మల్లేశం, కొమ్ము తిరుపతి, కందుల శ్రీనివాస్, కుమార్, ప్రవీణ్, పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

గోదావరిఖని, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అధికారులకు సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ప్రజలు సమస్యలను విన్నవించడానికి రాగా ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా సంప్రదించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. తాగునీటి సౌకర్యం, రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ సమస్యలు, ఆరోగ్య సమస్యలు, వైద్య సేవలపై అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించేందుకు చర్యలు చేపడుతున్నట్టు, అభివృద్ధి పనులకు కోట్ల రూపాయల నిధులను తీసుకువచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

సీనియర్ సివిల్ కోర్టు ఏజీపీగా రవికుమార్

కోల్‌సిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా గోదావరిఖనికి చెందిన ముష్కె రవికుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మూడేళ్ళ పాటు ప్రభుత్వం తరపున సివిల్ జడ్జి కోర్టులో కేసులను వాదించనున్నారు. నియామకానికి కృషి చేసిన ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, లీగల్ సెల్ చైర్మన్ కొప్పుల శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఏజీపీగా నియమితులైన ముష్కె రవికుమార్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి సిరిగి సంజయ్‌కుమార్ అభినందించారు.

వర్షం.. హర్షం...

కళ్యాణ్‌నగర్/జూలపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గోదావరిఖని పట్టణంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి నుంచి చిరుజల్లులతో వర్షం కురువగా సోమవారం రాత్రి సుమారు గంట పాటు భారీ వర్షం కురిసింది. జూలపల్లి మండలంలో ఆదివారం సాయంత్రం నుంచి వర్షం కురుస్తోంది.

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు సన్మానం

కోల్‌సిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్ పరిధిలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సోమవారం సీపీ అంబర్ కిశోర్ ఝా సత్కరించారు. ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఐ వెంకటేశ్వర్‌రావు, ఎన్ చంద్రశేఖర్, ఆర్ఐ అంజయ్యలను సీపీ సన్మానించారు. సుదీర్ఘకాలం క్లిష్ట పరిస్థితుల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేస్తున్న అధికారులకు అభినందనలు తెలిపారు. అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, పీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఆర్ఐలు దామోదర్, మల్లేషం, వామనమూర్తి, అధికా రుల సంఘం అధ్యక్షుడు పోచలింగం పాల్గొన్నారు.

కుక్కకాటు బారిన పడకుండా జాగ్రత్త పడాలి

కోల్‌సిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కుక్కకాటు బారిన పడకుండా జాగ్రత్త పడాలని రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి సూచించారు. సోమవారం తిలక్ నగర్ ప్రాంతంలో ఇంటింటా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వీధి కుక్కలు, పిచ్చి కుక్కల బారిన పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలను పోస్టర్ల ద్వారా ప్రదర్శిస్తూ కర పత్రాలు పంచిపెట్టారు. అనంతరం ఇందిరానగర్, అడ్డగుంటపల్లి ప్రాంతాల్లో ఉన్న వ్యాపార సంస్థలకు డీఅండ్ఓ ట్రేడ్ లైసెన్స్‌లపై అవగాహన కల్పించి లైసెన్స్ జారీ చేశారు. మార్కండేయకాలనీ రెయిన్‌బో పాఠశాల పక్కన నాలాలో పూడిక తొలగింపు పనులను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగ భూషణం, కుమార స్వామి హెల్త్ అసిస్టెంట్ సంపత్, మెప్మా సీఓ ప్రియదర్శిని, శమంతకమణి, పాల్గొన్నారు.

అవయవ దానం
మరో ముగ్గురికి ప్రాణ దానం

నిమ్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జవహర్‌నగర్‌కు చెందిన తుమ్మ రామకృష్ణ (56) టైలర్. జూన్ 26న తల తిరిగి కింద పడగా తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో ఆదివారం బ్రెయిన్ డెడ్ గురైనట్టు వైద్యులు నిర్ధారించారు. అవయవ దానంపై అతని భార్య రాజనిర్మలకు జీవన్‌దాన్ వైద్యులు అవగాహన కల్పించారు. అందుకు ఆమె అంగీకరించడంతో అతని శరీరం నుంచి లివర్, 2 కిడ్నీలను సేకరించి మరో ముగ్గురు వ్యక్తులకు ప్రాణదానం చేశారు.

ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలి

జూలపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలుకుంటలో సోమవారం అధికారులు పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామ సభను నిర్వహించారు. ప్రజలు కులమతాలకు అతీతంగా అందరు కలిసిమెలసి ఉండాలన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్‌రావ్, రవిందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): బుర్హన్‌మియాపేట్ గ్రామంలో సివిల్‌రైట్స్ డే నిర్వహించారు. కులం పేరుతో దూషిస్తే చట్టప్రకారం నేరమన్నారు. ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఏఎస్సై రాంచంద్రం, ఆర్ఐ చంద్రశేఖర్, కార్యదర్శి మహేష్, ఇరిగేషన్ ఏఈ వహీద్, పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల దీక్ష

రామగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులు తమ హక్కుల కోసం సోమవారం సెంటినరీకాలనీ అమరవీరుల స్థూపం ఎదుట దీక్ష చేపట్టారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. నూనెరాజేశం, జ్యోతిరెడ్డి, బూర్గుశంకర్‌గౌడ్, కళాధర్‌రెడ్డి, రాజయ్య, బత్తుల శంకర్, బొంకూరి పోచం, సుధాకర్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జూన్ నెలలో ఆర్జీ-2 ఉత్పత్తి 130 శాతం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జూన్ నెలలో ఆర్జీ-2 ఏరియా 103 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు జీఎం బండి వెంకటయ్య తెలిపారు. సోమవారం జీఎం ఆఫీస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఉత్పత్తి వివరాలను తెలిపారు. ఏరియాకు నిర్దేశించిన లక్ష్యం 5.50 లక్షల టన్నులు కాగా 7.16 లక్షల టన్నుల ఉత్పత్తి చేసి 130 శాతంగా నిలిచినట్టు తెలిపారు. ఓసీపీ-3 ప్రాజెక్టు లక్ష్యం 5.20 లక్షలు కాగా 6.98 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి(134%) జరిగినట్టు జీఎం తెలిపారు. వకీల్‌పల్లె గని టార్గెట్ 30,000 టన్నులకు గాను 18,274 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసినట్టు పేర్కొన్నారు. 48.50 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీయాలని జూన్ లక్ష్యానికి గాను 49.62 మిలియన్ క్యూబిక్ మీటర్లు తీసి 102% సాధించినట్టు తెలిపారు. సీహెచ్‌పీ ద్వారా జూన్ నెలలో 7.49 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసినట్టు జీఎం పేర్కొన్నారు. వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. గోదావరిఖని యైటింక్లయిన్‌కాలనీ సెంటినరీ కాలనీలను కలిపే కోల్‌కారిడార్ రోడ్డును విస్తరించేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నామని, వర్షాకాలం పూర్తయ్యాక రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నామని తెలిపారు. ఎస్వోటూ జీఎం రాముడు, పీఓ ఉదయ్ హరిజన్, అఫీషియేటింగ్ ఏరియా ఇంజనీర్ సృజన్ మెహ్రా, డీజీఎంలు అరవిందరావు(పర్సనల్), మురళీకృష్ణ (ఐఈ), ధనుంజయ (సివిల్), వెంకట రామచంద్ర (ఫైనాన్స్), రాంరెడ్డి (ఏరియా వర్క్‌షాప్) పాల్గొన్నారు.

రాజకీయ జోక్యం నివారించాలి


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఏఐటీయుసీ నేత సీతారామయ్య

రామగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో రాజకీయ జోక్యం నివారించాలని ఏఐటీయుసీ డిప్యూటి జనరల్ సెక్రెటరీ వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సోమవారం సింగరేణి సంస్థ ఏపిఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పిలో ఏర్పాటుచేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి కార్మికుల కుటుంబాల కోసం ఏఐటియుసి రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. కార్మికుల హక్కులతోపాటు విద్య కోసం యాజమాన్యం లక్షల రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. విద్యార్థుల ఉన్నత విద్య అందించాలని సెంట్రల్ సిలబస్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రమోషన్ పాలసీ విధానంలో ప్రతి కార్మికునికి ఇంక్రిమెంట్లు కల్పిస్తున్నారన్నారు. సొంతంటి కల సాకారం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రం ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ. 26 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వైవిరావు, జూపాక రాంచందర్‌రావు, ఎంఆర్‌సి రెడ్డి, బండారి క్రాంతి, రాఘవ, భాస్కర్‌రాజు, సంతోష్, గడ్డం రమేశ్, కేతా శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్, సదానందం, రూప్‌సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా భాస్కర్‌రావు వర్ధంతి

గోదావరిఖని, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ మాజీ ఉప ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి భాస్కర్‌రావు వర్ధంతిని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సోమవారం నిర్వహించారు. జీఎం ఆఫీస్ కూడలిలోని భాస్కర్ రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాస్కర్‌రావు భవన్‌లో స్మారక సభ నిర్వహించారు. కార్మికవర్గానికి చేసిన సేవలను కొనియాడారు. మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, సంకె అశోక్, గోషిక మోహన్, కనకరాజు, రంగు శ్రీను, గౌస్, భాస్కర్‌రావు శేషకుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

ఓసీపీ-2లో షావల్ ప్రారంభం

రామగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2లో నూతన షావల్‌ను సోమవారం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ప్రారంభించారు. బిఈఎంఎల్ కంపెనీకి చెందిన రూ. 4.90లక్షలతో కొనుగోలు చేపట్టిన 6.5 క్యూబిక్ మీటర్ల షావల్‌ను ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూజల అనంతరం జీఎం ప్రారంభించారు. యంత్రాల సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని జీఎం సూచించారు. ప్రాజెక్టు అధికారి సిహెచ్. వెంకటరమణ, అధికారులు శేఖర్‌బాబు, చంద్రశేఖర్, రామారావు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రారెడ్డి, కొటరవీందర్‌రెడ్డి, నాయకులు రామిండ్ల మనోహర్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓసీపీ-2 ప్రాజెక్టు ఆఫీసర్‌కు టీబీజీకేఎస్ నేతల వినతి

రామగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని పలు డిమాండ్‌లను పరిష్కరించాలని సోమవారం ఓసిపి-2 ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటరమణకు టీబీజీకేఎస్ నాయకులు నాగెల్లిసాంబయ్య, దేవశ్రీనివాస్, వెముల రవీశంకర్, ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. డిమాండ్‌ల పరిష్కారానికి ప్రాజెక్టు ఆఫీసర్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.



పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత


సమావేశంలో పాల్గొన్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి) పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరు బాధ్యతగా గుర్తించాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. అభివృద్ధి పేరుతో జరుగుతున్న పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం చేపట్టి భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం కల్పించాలన్నారు. ఉద్యోగులకు నిర్వహించిన పరీక్షలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులను ప్రదానం చేశారు. రాంచంద్రారెడ్డి, కొటరవీందర్‌రెడ్డి, అధికారులు నాగేశ్వర్‌రావు, రాజారెడ్డి, శ్రీనివాసులు, సత్యనారయణ, చంద్రశేఖర్, సుదర్శనం, నాగేశ్వర్‌రావు, ఐలయ్య, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

9న జరిగే సమ్మెను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు, విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

గోదావరిఖని, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని, దీనిని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలో ఈనెల 9న జరిగే సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక కోరింది. సోమవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో హెచ్‌ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, టీఎన్‌యూఎస్, ఏఐఎఫ్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఎస్‌జీకేఎస్ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని సమ్మె విజయవంతంపై చర్చించారు. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు, బడా పారిశ్రామికవేత్తలకు కార్మికవర్గాన్నితాకట్టు పెట్టి బానిసలుగా మార్చే చట్టాలను తీసుకువచ్చిందన్నారు. కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు రియాజ్ అహ్మద్, ఐ కృష్ణ, జీ రాములు, ఏడుకొండలు, పోగుల శేఖర్, ఈ నరేష్, రాజేశం, రవీందర్, రాజన్న, మల్లేషం, పాల్గొన్నారు.

● కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని సింగరేణి జేఏసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 9న దేశ వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను సింగరేణిలో జయప్రదం చేయాలని వారు కోరారు. సోమవారం భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాలను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణి జేఏసీ సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, టీబీజీకేఎస్ సంఘాల నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, ఎస్ నర్సింహారెడ్డి, తుమ్మల రాజారెడ్డి, మాదాసు రామమూర్తి, కే విశ్వనాథ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఆరోపించారు. జేఏసీ సంఘాల నాయకులు కే స్వామి, పీ ధర్మపురి, మెండె శ్రీనివాస్, పర్లపల్లి రవి పాల్గొన్నారు.

తీరనున్న తాగునీటి కష్టాలు

ముత్తారం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం నుంచి కస్తూర్బా పాఠశాలకు మధ్య ఉన్న నివాసాల్లోని ప్రజలకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. మిషన్‌భగీరథ పథకంలో భాగంగా కలెక్టర్ ప్రత్యేక నిధుల ద్వారా రూ.18లక్షలు కేటాయించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పనులు త్వరగా పూర్తి చేస్తున్నారు.

లయన్స్‌క్లబ్ కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ క్యాబినేట్ సెక్రటరీ

కమాన్‌పూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సాన రామకృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఆదర్శనగర్ సానాగార్డెన్‌లో ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా నల్లవెల్లి శంకర్, కోశాధికారిగా డాక్టర్ పి.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఇన గంటి భాస్కర్‌రావు, బోనాల వెంకటస్వామి, క్లబ్ సర్వీస్ చైర్మన్‌గా మచ్చగిరి రాము, సభ్యత చైర్మన్‌గా సీహెచ్ లింగ మూర్తి, మార్కెట్ చైర్మన్‌గా జబ్బార్‌ఖాన్, బోర్డుఆఫ్ డైరెక్టర్‌గా కోలేటి మారుతి, బండ సాయిశంకర్, తిమ్మరాజు శరత్‌కుమార్, అడ్మినిస్ట్రేషన్ చైర్మన్‌గా చంద్రశేఖర్, ఎల్‌సీఎఫ్ చైర్మన్‌గా చొప్పరి సంతోష్ ఎన్నికయ్యారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సభ్యులు మూడోసారి తనపై నమ్మకంతో అధ్యక్ష పదవి అప్పగించారని, వారి ఆశయాలకు అనుగుణంగా సేవలందిస్తానని తెలిపారు. ఎన్నికలకు 320జి, డిస్ట్రిక్ట్ క్యాబినేట్ సెక్రటరీ మాలేటి శ్రీనివాస్‌రావు, జెడ్‌సిజి సునీత ఎన్నికల అధికారులుగా వ్యవహించారు.

ఉత్తమ సేవలకు పురస్కారం

పెద్దపల్లిటౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ పూదరి దత్తాగౌడ్ ఉత్తమ సేవలకు లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ 320జీ గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు పురస్కారం ఆదివారం మంచిర్యాలలో అందజేశారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి 2258 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారని వెంకటేశ్వర్‌రావు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో సహకరించిన చల్మెడ ఆనందరావు ఆస్పత్రి నేత్ర వైద్య విభాగాధిపతి డాక్టర్ రఘుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉప గవర్నర్‌లు లయన్‌సింహారాజు కోదండరాములు, భద్రేశం పాల్గొన్నారు.

బెస్ట్ రీజియన్ చైర్‌పర్సన్‌గా సంపత్‌రావు

పెద్దపల్లి రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): హన్మంతునిపేట గ్రామానికి చెందిన వేల్పూరి సంపత్‌రావుకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బెస్ట్ రీజియన్ చైర్‌పర్సన్‌గా అవార్డు అందించారు. మంచిర్యాలలో జరిగిన కార్యక్రమంలో సంపత్‌రావుకు అవార్డుతోపాటు ప్రశంసపత్రం అందించారు.

స్వామికి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు

ధర్మారం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త బొల్లి స్వామి లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. 40 ఏళ్లుగా సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న స్వామికి ఉమ్మడి జిల్లా మాదిగ అఫీషియల్ ప్రొఫెషనల్ సంస్థ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా అవార్డును అందించింది. ఆదివారం రాత్రి అలుగునూర్‌లో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో అవార్డులను అందజేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ, ఉస్మానియా యునివర్సిటీ ప్రొఫె సర్ కాశి, మాజీ శాసనసభ్యులు ఆరెపల్లి మోహన్, ఎంఆర్పీఎస్ నాయకులు, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలు

కోల్‌సిటీటౌన్, జూన్30(ఆంధ్రజ్యోతి): విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై దాడులు చేస్తామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం హెచ్చరించారు. సోమవారం భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అడ్మిషన్ ఫీజును ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తీసుకోరాదని, ధనార్జనే ధ్యేయంగా రూ.2వేల నుంచి 5వేల వరకు అడ్మిషన్ ఫీజు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. పాఠ్యపుస్తకాలు విక్రయాల్లో డబ్బులు దండుకుం టున్నారని, ఐఐటీ, లీడ్, డీ డాక్, కోడింగ్, డీ కోడింగ్ వంటి విచిత్రమైన పుస్తకాలను ముద్రించి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు సొమ్ము చేసుకుంటున్నాయని మండిపడ్డారు. నితిలేష్, సురేష్, సాగర్, దినేష్, సాయిఅనుప్, శివ, కార్తీక్ పాల్గొన్నారు.

హరీష్‌రెడ్డికి ఘన స్వాగతం


హరీష్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు, అభిమానులు

కోల్‌సిటీటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ నాయకుడు వ్యాళ్ల హరీష్‌రెడ్డికి సోమవారం శంషాబాద్ విమానాశ్రమంలో రామగుండం, గోదావరిఖని ప్రాంత నాయకులు, అభిమానులు స్వాగతం పలికారు. జాహిద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, భాస్కర్‌రెడ్డి, బరుగు వంశీకృష్ణ, రామస్వామి, బోట్ల పోషం, పిడుగు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

యాదవులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద జరిగే యాదవ ఆత్మగౌరవ సభకు హైదరాబాద్ వెళ్తున్న యాదవులను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యాదవ విద్యార్థి సంఘం నాయకులు కూకట్ల నవీన్‌యాదవ్, తొట్ల భిక్షపతి ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దు

కమాన్‌పూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని డీసీపీ కరుణాకర్ అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. డయల్ 100కాల్స్ రికార్డుల బుక్‌ను పరిశీలించారు. సీసీ కెమెరాలను పరిశీలించి అన్ని సరిగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. డీసీపీ కరుణాకర్, సీఐ ప్రసాద్‌రావు మొక్కలు నాటారు ఎస్సై కే.ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మీర్జంపేట శివారులో జమ్మికుంట నుండి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసి బస్సు సోమవారం అదుపుతప్పి రోడ్డు పక్కకు వెళ్లింది. డ్రైవర్ చాకచక్యంతో బస్సుకు ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తగా నిలిపివేశాడు.

కుట్టుశిక్షణ కేంద్రం ప్రారంభం

రామగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్‌కే అపన్నహస్తం చేపడుతున్న ఉచిత కట్టు శిక్షణ బృహత్తర కార్యక్రమాల్లో మహిళలు స్వయం స్వావలంబన దిశగా అడుగులు వేయాలని జిల్లా వైద్యాధికారిణి ప్రసన్నకుమారి అన్నారు. సోమవారం కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధి మారుతీనగర్‌లో నిర్వహించే 9వ బ్యాచ్ ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమానికి డిఎంహెచ్‌వో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గృహిణిలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ఉత్తమ విద్యార్థికి ఆర్థిక ప్రోత్సాహం

జూలపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వడుకాపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అట్ల అక్షిత ఉత్తమ ఫలితం సాధించింది. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థికి పూర్వ విద్యార్థి ఎర్రోల్ల శ్రీకాంత్ రూ.5వేల నగదు అందజేశారు.